


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## జ్ఞాపకాల సవ్వడి

"**వీణా... అమ్మకి** డిమెన్షియా వచ్చిందిట" ఫోన్‌లో వంశీ కంఠం వినిపించింది.

"హేపీ ఫర్ హర్" వీణ చెప్పింది.

"ఏమంటున్నావ్? డిమెన్షియా అంటే నీకు తెలీదా?" అవతల నించి వంశీ ఆశ్చర్యంగా అడిగాడు.

"తెలుసు."

పదిక్షణాల తర్వాత వంశీ చెప్పాడు.

"అన్నం తిందో లేదో మర్చిపోయి ఒక్కోసారి రెండు మూడుసార్లు తినడం, లేదా అసలు తినకపోవడం చేస్తోందిట. మందుల విషయంలో కూడా ఇంతేట. మామయ్య ఫోన్ చేసాడు."

"షార్ట్ టైం మెమరీస్ లాస్ కాకుండా అమ్మకి లాంగ్ టైం మెమరీ లాస్ వచ్చుంటే బాగుండేది" వీణ చెప్పింది.

అది పట్టించుకోకుండా వంశీ అడిగాడు.

"అమ్మ ఆరోగ్యంగా ఉంటే అత్త, మామయ్య పైయ్యెత్తున చూసుకోగలరు కాని ఇలా అస్తవ్యస్తమైతే చూడలేరు. వెళ్ళి అమ్మని తీసుకొద్దాం అనుకుంటున్నా, ఏమంటావ్?"

"అవును. మంచి ఆలోచన. కాకపోతే నీ దగ్గర వద్దు. అమ్మని నేను చూసుకుంటాను. నీకు ఇబ్బంది. నాకు తెలుసు" వీణ చెప్పింది.

"నీకింకా కష్టం నీ ప్రొఫెషన్‌లో బిజీగా ఉంటూ అమ్మని కనిపెట్టుకుని ఉండటం మాటలు కాదు."

"నేను చూసుకుంటానన్నాగా? ఏదో ఏర్పాటు చేస్తాలే. కావాలంటే పని తగ్గిస్తా. నా చేతిలో పనేగా" వీణ కొట్టిపారేస్తూ చెప్పింది.

రెండు రోజుల తర్వాత వంశీ నించి మళ్ళీ ఫోన్ వచ్చింది.

"వీణా! మన ఊరెళ్ళి పదిరోజులుండి అమ్మని తీసుకొద్దామా?"

"పది రోజులా?" వీణ ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. అమ్మ మనతో వస్తే మనం మళ్ళీ మన ఊరువెళ్ళం. వెళ్ళినా మనింట్లో పదిరోజులు ఉండం. ఎందుకో అక్కడ కొన్ని రోజులు అమ్మతో, మనింట్లో ఉండాలని వుంది. నీకు కుదురుతుందా?"

"నో ప్రాబ్లం. మంచి ఆలోచన. నీ డేట్స్ చెప్పు. ఆ ప్రకారం పని అడ్జస్ట్ చేసుకుంటా.. ఒక్కడివే వస్తున్నావా?"

"అవును, లేప్‌టాప్ కూడా తీసుకురాను. కేవలం ఫోనే" వంశీ నవ్వాడు.

గన్నవరం ఏర్‌పోర్ట్‌లో విమానం దిగి బయటకి వచ్చిన వీణ తనకోసం వేచి వున్న వంశీని చూసి దగ్గరకి వెళ్ళి కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లుతూండగా చెప్పింది.

"పెద్దవాడివైపోతున్నావురా అన్నాయ్"

"ఏభై ఏళ్ళు రావడంలా మరి?" వంశీ చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ చిరునవ్వుతో చెప్పాడు.

"ఇంకా నయం. నీకు నలభై ఆరే. నీతోపాటు నన్నూ పెద్దదాన్ని చేయకు" వీణ కూడా నవ్వింది.

"ఎంతసేపైంది నువ్వొచ్చి?" కారులో అతని పక్కన కూర్చుంటూ అడిగింది.

"గంటన్నరైందేమో. నీ ఫ్లయిట్ అరైవల్ టైంకి ఇక్కడికి వచ్చేలా ప్లాన్ చేసుకున్నాను. మనం వస్తున్నట్లు అమ్మకి ఫోన్ చేసా. చాలా సంతోషపడింది." వంశీ కారు స్టార్ట్ చేస్తూ చెప్పాడు.

"అది వేరే చెప్పాలా?" వీణ నవ్వింది.

వాళ్ళు కారు దిగి ఇంట్లోకి వెళ్ళేప్పటికి దేవిక హాల్‌లో మంచం మీద కూర్చుని టి.వి చూస్తోంది.

"అమ్మా" వీణ వేగంగా నడిచి ఆమె పక్కన కూర్చుని తల్లి భుజం మీద తలానించింది.

"ప్రయాణం బాగా సాగిందా వీణమ్మా?" ఆవిడ కూతురి చెంపలు నిమురుతూ అడిగింది.

"బ్రహ్మాండంగా."

వంశీ వచ్చి తల్లికి రెండోవైపు కూర్చున్నాడు.

"పిల్లలు, కోడలు బావున్నారా అబ్బాయ్?" ఆవిడ కొడుకు చెయ్యి పట్టుకుని అడిగింది.

"ఆహా! నువ్వెలా ఉన్నావ్?"

"బానే వున్నారా. కాని ఈ మధ్య మతిమరుపు రోగం వచ్చి పడింది" ఆవిడ విచారంగా చెప్పింది.

"చాలా మంచి మందులున్నాయమ్మా ఇప్పుడు. తగ్గిపోతుందిలే" ఊరడింపుగా చెప్పాడు.

"చిక్కి పోయ్యారా పిల్లలు" ఆవిడ ప్రేమగా చెప్పింది.

వీణ పెద్దగా నవ్వింది.

"మేం చిక్కిపోయామని చెప్పింది నువ్వేనమ్మా. నీ కళ్ళకి మేం ఎప్పుడూ చిక్కిపోయిన చిన్న పిల్లలమే"

ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"మంచి నీళ్ళు తెస్తా" దేవిక లేవబోయింది.

"అక్కర్లేదమ్మా. కూర్చో. ఐదు నిమిషాలాగి కాఫీ పెడతా. పాలున్నాయిగా?" వీణ అడిగింది.

"మీరొస్తున్నారని వంశీ ఫోన్ చేసాడుగా, పాలు, పెరుగు, కూరగాయలు అన్నీ తెప్పించా. ఇంకేం మర్చిపోయానో మరి" ఆవిడ నిట్టూర్చింది.

తనకి వచ్చిన మానసిక సమస్యకి తల్లి బాధపడుతోందని ఇద్దరూ గ్రహించారు.

ఆ విషయం పట్టించుకోనట్లుగా తల్లితో మాట్లాడుతూ ఉండిపోయారు.

రాత్రి ఎనిమిదిన్నరకల్లా దేవిక నిద్రపోయింది. అన్నా, చెల్లెళ్ళిద్దరు డైనింగ్ టేబుల్ కుర్చీల్లో కూర్చున్నారు.

వీణ దీర్ఘ శ్వాసని వదిలి చెప్పింది.

"ఈ ఇంటికి అమ్మ ఎంత చాకిరి చేసింది. అతి శుభ్రం. పొందిక. ఈ రోజుకీ అలాగే ఉంది. కొద్దిగా పాతదైనా, మనకి ఈ మాత్రం క్రమశిక్షణ వుందంటే అమ్మే కారణం"

"అవును. అమ్మ పగటిపూట ఎప్పుడూ విశ్రాంతిగా కూర్చునేది కాదు. అంత ఏక్టివ్‌గా ఉండేదానికి ఈ జబ్బేమిటో" వంశీ విచారంగా చెప్పాడు.

"నేను థర్డ్ క్లాస్‌లో ఉన్నప్పుడనుకుంటా. మన స్కూల్ దగ్గర రాఘవయ్య గారింట్లో ఒకావిడ దిగింది. వాళ్ళు వేరే పెద్ద ఇల్లు కట్టుకుని మారిపోయారు. స్కూల్ వదిలే టైంకి నాన్న సైకిల్ ఆ ఇంటిముందు కనిపించేది. మొదటి రోజు నాన్న సైకిల్ చూసి సంబరపడ్డా. సైకిల్ మీద ఇంటికి తీసుకెళ్తాడని ఆ ఇంట్లోకి వెళ్ళాను. నాన్న, ఆవిడ ఒకే మంచం మీద పక్క పక్కన కూర్చుని ఉన్నారు. ఆ వయసుకే నాకు అదెందుకో నచ్చలేదు. నిశ్శబ్దంగా వెనక్కి వచ్చేసాను. ఓసారి నాన్నవాళ్ళ దూరబ్బంధువు ఒకాయనపోయాడని కబురు వచ్చింది. సమయానికి, నాన్న ఇంట్లో లేడని అమ్మ కంగారు పడితే నాన్న రాఘవయ్య వాళ్ళ పాతింట్లో ఉన్నాడని చెప్పా. అమ్మకది షాక్."

వీణ ఓ నిమిషం నిశ్శబ్దంగా ఉండి మళ్ళీ చెప్పింది

"ఆ రోజు రాత్రి నాన్న వచ్చాక అమ్మ ఆ విషయం నెమ్మదిగా అడిగింది. పట్టుబడ్డ గిల్టీతో అనుకుంటా నాన్న పెద్ద పెద్దగా అరిచి ఇంట్లోంచి బయటకి వెళ్ళిపోయారు. "

"నాకు గుర్తుంది." వంశీ చెప్పాడు.

"అమ్మ ఓ రోజు నన్ను 'ఆ మనిషిని చూసావా?' " అని అడిగింది.

చూసానని చెప్పా.

'ఎలా వుంటుంది?' అని అడిగింది.

పీచు మిఠాయి రంగు కుంకుం బొట్టు పెద్దది గుండ్రంగా పెట్టుకుంటుందని చెప్పా. మర్నాడు నాన్న ఇంటికి వచ్చే సమయానికి అమ్మ అచ్చం అలాగే పీచు మిఠాయిరంగు బొట్టు పెట్టుకుంది.

నాన్న అది చూసి 'ఏం వేషాలు?' అని పక్కనే ఉన్న తాడు తీసుకుని అమ్మని కొట్టాడు" వీణ కంఠం వణికింది.

"నువ్వూ నేనూ అడ్డం వెళ్ళాం. నువ్వు నాన్న కాళ్ళు పట్టుకుంటే, నేను అమ్మకి రక్షణగా వెళ్ళాం. నాకు కూడా ఒకటి రెండు దెబ్బలు తగిలాయి" వంశీ చెప్పాడు.

"అమ్మకి ఈ జ్ఞాపకం చెరిగిపోతే బావుండు." వీణ నెమ్మదిగా చెప్పింది.

"తర్వాత నేనో పని చేసాను. ఎవరికీ చెప్పలేదు ఇంతదాకా. నాన్న అమ్మని ఎందుకు కొట్టాడో నాకు అర్థమైంది. ఏదో చెయ్యాలనిపించింది. పసివాడిని. ఏం చేయగలను? ఆవిడ మూలంగానే అమ్మ దెబ్బలు తిందనే కోపంతో రగిలిపోయాను. ఆవిడ దగ్గరకి మగవాళ్ళు వెళ్ళడం తప్పని కూడా నాకు ఆ వయసుకే అర్థమైంది. నాన్న అమ్మని కొట్టిన మర్నాడు సాయంత్రం మునసబుగారింటికి వెళ్ళాను. వాళ్ళబ్బాయి లాంబ్రెట్టా రాఘవయ్యగారి పాతింటిముందు ఉంటోందని, స్కూల్ నించి వచ్చే పిల్లలు దాన్నెక్కి పాడుచేస్తున్నారని, స్కూటర్ని లోపల పెట్టుకోమని చెప్పమని చెప్పాను. రెండు రోజుల్లో ఆవిడ ఊరు వదిలి వెళ్ళిపోయింది" వంశీ చెప్పాడు.

వీణ పెద్దగా నవ్వింది.

"భలే ఇంటెలిజెంట్‌విరా అన్నాయ్ నువ్వు" అభినందించింది.

"ఇంకా పడుకోలేదర్రా?" దేవిక గదిలోంచి వచ్చి ఇంకో కుర్చీ లాక్కుని కూర్చుంది.

"అమ్మా నువ్వు రోజూ సాయంత్రం దీపం పెట్టేప్పుడు ఒక పాట పాడేదానివి. అది పాడవా?" వీణ గారాబంగా అడిగింది.

"బాగుంది. అర్ధరాత్రి అంకమ్మ శివాలు" దేవిక నవ్వింది.

"అవునమ్మా పాడు. నువ్వు భలే పాడేదానివి" వంశీ ప్రోత్సాహించాడు.

దేవిక గొంతు సవరించుకుంది. రెండు ముక్కలు పాడాక చెప్పింది.

"ఫణితి మర్చిపోయారా. రేపు జ్ఞాపకం తెచ్చుకుని పాడతాలే"

"ఏదో పాట పాడమ్మా. నాకు నీ గొంతు రాలేదు. కాకి గొంతు వచ్చింది" వీణ నవ్వింది.

"రాగాలా సరాగలా హాసాలా విలాసాలా.." దేవిక బిగ్గరగా పాడింది.

"అమ్మా !ఎంత బాగా పాడావో."

పిల్లలిద్దరూ చప్పట్లు కొట్టారు.

"ఇంకో పాట పాడనా?" దేవిక ఉత్సాహంగా అడిగింది.

"ఒకటికాదు. చాలా.. నీ ఓపిక. మేం హాయిగా వింటాం" వంశీ చెప్పాడు.

దేవిక గొంతెత్తి దాదాపు అరడజను పాటలు పాడింది. కొన్నిటిలో పదాలు, కొన్నిటిలో చరణాలు మాయమయ్యాయి. ఐనా పిల్లలు చిరునవ్వుతో విన్నారు.

"ఇంత బాగా పాడడం ఎలా వచ్చమ్మా నీకు? అప్పటి పాటలు గుర్తున్నాయ్ కూడా" వీణ చెప్పింది.

దేవిక సంతోషంగా చూసి చెప్పింది.

"నువ్వు చక్కని చుక్కవి అనేది శివపార్వతక్క"

ఆవిడ మనసు అస్తవ్యస్తమైందని వాళ్ళకి అర్థమైంది.

"అమ్మా. తెల్లారుతోంది. పడుకుందామా?"

వీణ లేచి తల్లి చెయ్యి పట్టుకుని గదిలోకి తీసుకెళ్ళింది.

మర్నాడు ఉదయం ఎనిమిదాకా ఎవరూ నిద్రలేవలేదు. మొదట వీణ లేచి మొహం కడుక్కుని వచ్చి స్టవ్ మీద పాలగిన్నె పెట్టింది. ఎనిమిదిన్నరకి వంశీ లేచి బయటకి వచ్చాడు.

"నీ కోసమే వెయిటింగ్. కాఫీ తాగుదాం రా" వీణ రెండు గ్లాసుల్లో కాఫీ తీసుకొచ్చింది.

"స్నానం చేసి అత్తయ్యవాళ్ళింటికి వెళ్దాం. అమ్మకి కూడా తనని మనతో తీసుకువెళ్తున్నామని నెమ్మదిగా చెప్పాలి" వంశీ కాఫీ తాగుతూ చెప్పాడు.

"నాయనమ్మకి అమ్మంటే ఇష్టం. అది అత్తయ్యకి నచ్చేది కాదు. 'నీకు కూతురి కంటే, కోడలే ఇష్టం' అని సాధించేది"

పక్కింట్లో ఉన్న మేనత్త తమ మాటలు వింటుందేమో అన్నట్లుగా వీణ గొంతు తగ్గించి చెప్పింది.

"రాత్రి అమ్మ అన్నట్లు చిన్నప్పుడు అమ్మ చాలా అందంగా ఉండేదట. ఏదో పెళ్ళిలో నాయనమ్మ అమ్మని చూసి, పట్టుబట్టి నాన్నతో పెళ్ళి చేసిందిట" వంశీ చెప్పాడు.

"ఓసారి నాయనమ్మ అమ్మకి పూలజడ వేసి, పట్టుచీర కట్టుకోమని, తన నగలన్నీ అలంకరించింది. అప్పుడు అమ్మెంత బావుందో లక్ష్మీదేవిలా కళకళలాడుతూ" వీణ చెప్పింది.

"అవును. ఆ రోజు నాన్న కూడా అమ్మని 'దేవీ శ్రీదేవీ' అని పాడుతూ సరదాగా ఉన్నాడు" వంశీ చెప్పాడు.

"ఈ జ్ఞాపకం చెరిగిపోకుండా అమ్మ మనసులో ఉండిపోతే బావుండు" వీణ నేప్కిన్‌తో కళ్ళు అద్దుకుంది.

"వీణా. తలుపు చప్పుడవుతూంటే తీయరేంటమ్మా? రాజు మామయ్యేమో! పాపం ఎంతసేపు బయట నిలబెడతారు? గడియ తీయమ్మా." దేవిక నిద్రలో కలవరిస్తోంది.

అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒకరి మొహం మరొకరు చూసుకున్నారు. దేవిక అన్నయ్య రాజగోపాల్ కేన్సర్‌తో పోయి పదిహేనేళ్ళవుతోంది.

"వంశీ" ఆవిడ పెద్దగా పిలిచింది.

వంశీ ఒక్క ఉదుటన తల్లి దగ్గరకి వెళ్ళాడు.

"ఏంటమ్మా?"

"రాజన్నయ్యరా, పాపం ఎండలో నించున్నాడు. తలుపు తీయండ్రా."

ఆవిడ బాధగా చెప్పింది.

"అమ్మా నువ్వు లేచి తయారైతే మనం అత్తయ్య ఇంటికి వెళ్దాం. లే" వంశీ ఆ మాటలు పట్టించుకోకుండా ఆవిడ్ని లేవదీస్తూ చెప్పాడు.

వంశీ మేనత్త వాళ్ళని చూసి చాలా సంతోషించింది. వదిన ఆరోగ్య పరిస్థితిని వాళ్ళకి వివరించి విచారించింది.

"ఇవాళ ఇక్కడే భోంచేసి వెళ్ళండ్రా. నిన్ను చూస్తూంటే మా అన్నయ్యని చూసినట్లే ఉంది" అభిమానంగా చెప్పింది.

సాయంత్రందాకా అక్కడే ఉండిపోయి రాత్రి భోజనం చేసి వచ్చారు. దేవిక కూడా ఆడపడుచుతో కబుర్లు చెప్తూ, వంటలో సాయం చేస్తూ ఉత్సాహంగా తిరిగింది.

"మతి మరుపుతో పొయ్యి ఆర్పడం మర్చిపోతుందేమోనని వారంగా వదినకి నేనే వంటచేసి పంపుతున్నా" వాళ్ళు వచ్చేస్తూంటే మేనత్త చెప్పింది.

వీణ ఆవిడ చేతుల్ని కళ్ళకి అద్దుకుని చెప్పింది.

"థాంక్స్ అత్తా. అమ్మని నాతో తీసుకెళ్తున్నాను. ఇక్కడి కంటే, బాంబేలో మంచి వైద్యం జరుగుతుందని నా ఆశ."

"అయ్యో ఇంతకాలం తోడునీడగా ఉన్నాం. వదిన వెళ్ళిపోతే వంటరిదాన్నవుతా" ఆవిడ కంటతడి పెట్టింది.

ఇంటికి రాగానే దేవిక నిద్రపోయింది.

"నాన్న వయసులో ఉన్నప్పుడు అమ్మనంత హింసించి, మనం పెద్దవాళ్ళమయ్యాక తగ్గి, చివరి రోజుల్లో 'దేవీ దేవీ' అంటూ అమ్మతో బానే ఉండేవాడు" వంశీ చెప్పాడు.

"వృద్ధ నారీ పతివ్రత అనే సామెత ఇలాంటివాళ్ళని చూసే పుట్టింది. చేతకానప్పుడు పెళ్ళాంతో చాకిరి చేయించుకోవాలంటే ఆ మాత్రం లౌక్యం ఉంటుందిలే" వీణ కోపంగా చెప్పింది.

"అమ్మకి వాళ్ళన్నయ్య అంటే ప్రాణం. కాని నాన్న అమ్మని పుట్టింటికి పంపేవాడు కాదు. నాయనమ్మ వెళ్ళనీరా అన్నా కూడా వినేవాడు కాదు. మామయ్యే ఓ సాయంత్రం వచ్చి మర్నాడు పొద్దున్న వెళ్ళిపోయేవాడు."

"అవును మామయ్య ఉన్నంతసేపు అమ్మ చాలా ఇబ్బంది పడేది. బహుశా నాన్న వచ్చి గొడవ చేయడమో, తనని తిట్టడమో చేస్తే అన్నగారి ముందు అవమానంగా ఉంటుందనేమో? ఎప్పుడైనా నాన్న వెళ్ళమని పర్మిషన్ ఇస్తే అమ్మకి ఎంత ఆనందమో. నేను 'ఎందుకమ్మా నాన్నతో దెబ్బలు తింటూ ఉంటావు. మనం వెళ్ళిపోదాం పద. నాన్నకి విడాకులిచ్చెయ్. మనం ఎలాగో బతుకుదాం' అని ఆవేశంగా అరిచేదాన్ని. అమ్మ నవ్వి 'నాకు పిడకలు చేయడం కూడా రాదు. ఎట్లా బతుకుదాం?' అనేది. నాకు అమ్మ మీద కూడా కోపంగా ఉండేది ఆ వయసులో. ఎందుకలా పడుంటుందని" వీణ చెప్పింది.

"కారణం ఏదైనా అమ్మా నాన్నతో సుఖంగా ఉంది ఆయన చివరి రోజుల్లోనే" వంశీ తల్లి గదిలోకి తొంగి చూసి చెప్పాడు.

"అన్నాయ్ నీకు గుర్తుందా? మన చిన్నప్పుడోసారి నాన్న మనల్ని సినిమాకి తీసుకెళ్తానన్నాడు. నాయనమ్మ రానంది. అమ్మ మనిద్దరిని తయారు చేసి తను చక్కగా రెడీ అయి, చకచకా జాజిపూలు మాల కట్టి తల్లో పెట్టుకుంది. నాన్నకూడా ఆ రోజు చాలా హుషారుగా ఉన్నాడు"

"అవునవును. గుర్తుంది. సినిమా అయ్యాక కబుర్లు చెప్పుకుంటూ నడిచి వచ్చాం. రాగానే నాయనమ్మకి చెరోవైపు కూర్చుని కథ చెప్పాం" వంశీ ఉత్సాహంగా చెప్పాడు.

"అమ్మకి ఈ జ్ఞాపకం చెదిరిపోకుండా ఉంటే బావుండు" వీణ నిట్టూర్చింది.

"అమ్మ నాన్నతో ఎన్ని బాధలు పడిందో అంతకు రెట్టింపు మంగళతో పడింది" వంశీ సిగ్గుగా చెప్పాడు.

వీణ మాట్లాడలేదు.

"నా అత్తగారి వైపు వాళ్ళంతా అంత బ్రహ్మ రాక్షసులని నాకు తెలియదు. నిశ్చితార్థం దాకా వినయంగా ఉన్నారు. అదవ్వగానే మా అత్తగారు అమ్మని 'మీరు అలా రాసుకు పూసుకు తిరక్కూడదు. ఓ మూల కూర్చుంటే బావుండేది' అందట. నాకు తెలీదు. తెలిస్తే అప్పుడే పెళ్ళి కేన్సిల్ చేసేవాడ్ని. తర్వాత ఎప్పుడో అత్త చెప్పింది. ఇక మంగళ రాక్షసి. నేను లేనప్పుడు అమ్మని సాధించి, ఉన్నప్పుడు ప్రేమలు కురిపించేది. ఈ ప్రవర్తనకే అసలు అమ్మ మతిపోయి ఉంటుంది. పిల్లల్ని ఎత్తుకోడానికి ఇచ్చేది కాదు. పనిలో సహాయం చేయడానికి వస్తే ఒప్పుకునేది కాదు. ఆఖరికి కాఫీ కూడా చేతికిచ్చేది కాదు. టేబుల్ మీదో, టీపాయ్ మీదో పెట్టి వెళ్ళేది. అసలు అమ్మ మనసులో ఈ మంగళ చాప్టర్ అంతా ఇరేజ్ అయిపోవాలి" వంశీ కోపంగా చెప్పాడు.

"అమ్మ లైఫ్, నీ లైఫ్ చూసాక నాకు పెళ్ళంటేనే భయం వచ్చింది. నాకు ముప్పై ఎనిమిదేళ్ళు వచ్చేదాకా 'వీణమ్మా! ఓ మంచి అబ్బాయున్నాట్ట' అని ఫోనులు చేసేది. తర్వాత ఆ వయసు పెళ్ళికానివాళ్ళు దొరక్క మానేసింది. పెళ్ళికానందుకు నేనేం బాధ పడడం లేదు. ఆర్కిటెక్ట్‌గా చాలా సంపాదించా. పేరు, డబ్బు. కానీ అన్నాయ్. నా అనేవాళ్ళుండాలిరా. లేకపోతే జీవితం అసంతృప్తిగా ఉంటుంది. ఎన్నిసార్లు హైద్రాబాద్ వచ్చానో. మీ ఆవిడకి భయపడి నిన్ను కాంటాక్ట్ చేయలేదు. ఊరొచ్చి అమ్మని చూద్దామంటే పెళ్ళి కాలేదని ఊళ్ళో తెలిసిన వాళ్ళు సర్కాస్టిక్‌గా మాట్లాడతారు. అందుకే సెలవు తీసుకోకుండా పనిచేస్తూ వస్తున్నాను" వీణ నిట్టూర్చింది.

"నేను చాలా సిగ్గుపడుతున్నా వీణా. అమ్మని తీసుకొచ్చి, అత్తయ్య మామయ్యలకి అప్ప చెప్తూంటే సిగ్గుతో ఎంత చచ్చిపోయానో నాకు తెలుసు. కానీ ఇన్నేళ్ళూ అమ్మ హాయిగా బతికింది. మంగళ పోరులేకుండా. నేను వీలైనంతవరకు వస్తూనే వున్నాను. అమ్మకి నేనంటే కోపం లేదు కదా?" వంశీ బేలగా అడిగాడు.

"ఛఛ! కన్నపిల్లలమీద కోపం ఉంటుందా? అమ్మ నా దగ్గర ఉంటుంది కాబట్టి నువ్వు బాంబే వస్తూండాలి మరి వీణ ఊరడింపుగా చెప్పింది.

వంశీ చెల్లెలి వంక అభిమానంగా చూస్తూ చెప్పాడు.

"మనం కొన్ని విషయాల్లో చాలా నిర్లక్ష్యంగా ఉంటాం చెల్లాయ్. ఏంటో అవసరమైతేనే నీకు కాల్ చేస్తాను. ఏం 'ఎలా ఉన్నావమ్మా?' అని చేయకూడదా? తట్టదు అంతే. "

"నేనూ అంతేగా?"

"గతం గతః ఇకనించి మనం కనీసం ఆర్నెల్లకోసారైనా కలుద్దాం. నేనే వస్తా. నువ్వు హైదరాబాద్ వస్తే నీ హోటల్ రూంకి వచ్చి కలుస్తా" ఉద్వేగంగా చెప్పాడు.

"అమ్మ నాతో ఉంటుందిగా ఇంక టూర్స్ ఉండవులే. నువ్వే వస్తూ వుండు" వీణ నవ్వింది.

"అమ్మకి తగ్గిపోతే బావుండే, నాకు దిగులుగా ఉంది" వంశీ బేలగా చెప్పాడు.

"చూద్దాం. అమ్మ జ్ఞాపకాల్లోంచి చెడ్డ జ్ఞాపకాలు మాత్రమే చెరిగిపోయి, మంచి జ్ఞాపకాలు పదిలంగా ఉండే మందుందేమో కనుక్కుందాం." వీణ కన్నీళ్ళ మధ్య చెప్పింది

"ముఖ్యంగా అమ్మ జ్ఞాపకాల్లో మనం ఉండాలి చెల్లాయ్. వీణమ్మా, వంశీ అనే పిలుపు ఎప్పటికీ మనకి దూరం కాకూడదు" వంశీ కళ్ళల్లో కూడా నీళ్ళు తిరిగాయి.

"నాయనమ్మ కోప్పడుతుంది. వెళ్ళి పడుకోండిరా. రేప్పొద్దున్నే మళ్ళీ స్కూల్‌కి వెళ్ళాలి" గదిలోనుంచి దేవిక అరిచింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments